ప్రజాశక్తి

బుధవారం 14 ఫిబ్రవరి 2024

5

అల్లూరి సీతారామరాజు

15న మెగా వాలీబాల్ టోర్నీ : సిఐ

ప్రజాశక్తి-జిమాడుగుల:మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను ఈ నెల 15న సూరిమెట్ట గ్రామంలో నిర్వహించనున్నామని సిఐ రమేష్, ఎస్సై శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులు ఈ పంచాయతీల వారు అయ్యి ఉండాలన్నారు.

జి.మాడుగుల మండలం బోయితిలి, కిల్లంకోట, లువ్వాసింగి, నుర్మతి, పెదబయలు మండలంలో లింగేటి, బొంగరం, ఇంజరి, గిన్నెల కోట, జామిగుడ, ముంచింగి పుట్టు మండలంలో కుమడ, బూసుపుట్టు పంచాయతీల్లో ఉన్న వాలీబాల్ టీమ్స్ సంబంధిత మహిళ పోలీస్ వద్ద రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు.మొదటి బహుమతి 20వేలు, రెండో బహుమతి 15 వేలు, మూడవ రూ.10 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి టీమ్‌కు డ్రెస్ ఇస్తామన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్నా సిఐ రమేష్ 9440904222, ఎస్సై శ్రీనివాస్ 9440904221 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

అటవీ ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేయాలి

- ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయ :ఆదివాసులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులు చింతపండు, చిపుళ్లతో 24 రకాలు ఆదివాసి రైతులు పండిస్తున్న పసుపు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ లు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధిలో ఆదివాసులు సేకరిస్తున్న చింతపండుకు కిలో రూ.60లు మద్దతు ధర ప్రకటించాలని ప్రతి సంతలో చింతపండు కొనుగోలు కేంద్రాలు జిసిసి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసి రైతులు పండిస్తున్న పసుపు పంటకు కిలో రూ.200 కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వారపు సంతల్లో దళారుల మోసాలను అరికట్టి, జిసిసి ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదివాసులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులు చింతపండు చీపుళ్ళు, ఉసిరికాయ, ఇతర అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ఐటిడిఎ ద్వారా జాఫ్రా కొనుగోలు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని రైతులు పండించిన జాఫ్రాలను ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఆయన వెలుగు, జిసిసి అధికారులు, హార్టికల్చర్ అధికారి, వివిధ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారస్తులతో జాఫ్రా కొనుగోలుపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ జాఫ్రా రైతులు దళారుల చేతిలో గిరిజనులు మోసపోకుండా, గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఒక మెట్రిక్ టన్ను ఎంతకు కొనుగోలు చేస్తున్నారు? ఏయే రకం కొనుగోలు చేస్తున్నదీ వివిధ కంపెనీల నుండి వచ్చిన ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఐటిడిఎ ద్వారా కొనుగోలు చేసిన జాఫ్రా విత్తనాలు వేలం లేదా ఇతర మార్గాలలో వివిధ కంపెనీలకు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, పిహెచ్ఓ చిట్టిబాబు, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న తల్లులు, పిల్లలు

అంగన్వాడీ కార్యకర్తను నియమించాలి

-తల్లులు, పిల్లలు నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి:మాతా శిశు మరణాలు అరికట్టేందుకు గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి పౌష్టికాహారం అందించాలని, అంగన్వాడి కార్యకర్తలను నియమించాలని మండలంలోని మారుమూల పెద్దకోట పంచాయతీ పరిధి కొండిభ కోట గ్రామానికి చెందిన తల్లులు గర్భిణీలు, పిల్లలు మంగళవారం నిరసన చేపట్టారు. కొండతాబెల, సుజాతగుంట, అమ్మాజీ గొల్లూరి, దానుమోతి ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ గ్రామంలో సుమారు 30 కుటుంబాలు 160 పైగా జనాభా ఉందన్నారు. బాలింతలు, గర్భిణీలు పది మంది, పిల్లలు 25 మంది ఉన్నారని తెలిపారు. తమ గ్రామంలో అంగన్వాడి పోస్టును ప్రభుత్వం భర్తీ చేయలేదని, దీంతో తమ గ్రామం నుండి సుమారు కిలోమీటర్ దూరం గెడ్డ వాగు దాటి తమ్ముటు గ్రామానికి వెళ్ళవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో గెడ్డ పొంగి పారుతుండటంతో వాగు దాటి వెళ్ళలేని పరిస్థితి నెలకొంటుందన్నారు.జిల్లా కలెక్టర్, పిఓ, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తమ కొండిబకోట గ్రామంలో కొత్త అంగన్వాడి పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మూడు రోజుల క్రితం గ్రామంలో పర్యటనకు వెళ్లిన స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు దృష్టికి కూడా ఈ విషయాన్ని గ్రామ ప్రజలు విన్నవించారు.

సక్రమంగా..

'మధ్యాహ్న పథకం' అమలు చేయాలి

జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ రావు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు పటిష్టంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు ఆదేశించారు. మంగళవారం స్థానిక శ్రీ కృష్ణాపురం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అన్ని యాజమాన్య పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పట్టి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా సరఫరా చేస్తున్న పోషకాహార పదార్థాలను బడి పిల్లలందరికీ సక్రమంగా పంపిణీ చేయాలని ఆయన చెప్పారు. గుడ్లు. చెక్కిలు, రాగి జావ వంటి ఆహార పదార్థాలను కచ్చితంగా మధ్యాహ్న భోజనంలో సరఫరా చేయాలన్నారు.
మిడ్ డే మీల్స్ ప్రోగ్రాం అసిస్టెంట్ డైరెక్టర్ జి.అప్పారావు, మండల విద్యాశాఖ అధికారి యస్.రామచంద్రరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ఆన్లైన్లో హాజరు నమోదు చేయాలన్నారు. బైజుస్ టాబ్ లను పిల్లలతో సక్రమంగా వినియోగింప చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి సరస్వతి దేవి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మజీరావు

సీలేరు యూనియన్ కార్యాలయంలో సిఐటియులో చేరిన కాంట్రాక్టు కార్మికులు

సిఐటియులో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల చేరిక

ప్రజాశక్తి -సీలేరు

ఏపీ జెన్కో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ (సిఐటియు)లో మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న 11 మంది కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం చేరారు. ఈ సందర్భంగా యూనియన్ సీలేరు అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణ్, విష్ణుకుమార్ మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు డిమాండ్లు నెరవేర్చుకోవటానికి ఐక్యంగా పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఇందు కోసం యూనియన్‌ను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై తమ యూనియన్ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై కార్మికులు చేరినట్లు చెప్పారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జల విద్యుత్తు కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమ యూనియన్‌లో చేరడంతో మరింత బలోపేతం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాచ్‌ఖండ్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు జి.సాల్మన్‌రాజు మాట్లాడుతూ సీలేరులో సిఐటియు అనుబంధంగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు హక్కుల సాధన కొరకు అనేక పోరాటాలు చేస్తున్నారని, వీరితో తాము భాగస్వామ్యం కావాలని ఉద్దేశంతోనే సిఐటియు యూనియన్‌లో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.సుభాన్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజవొమ్మంగిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పొరుగు సేవలు (ఔట్ సోర్సింగ్) పద్ధతిలో పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్జెక్టులో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీలలో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది, ఏపీ టెట్లో క్వాలిఫై అయి, రెండు లెవెల్స్‌లో ఇంగ్లీష్ మీడియంలో చదివి ఉన్న వారు దీనికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను రంపచోడవరం ఐటిడిఎలోని గురుకులం సెల్‌లో ఈ నెల 19వ తేదీ లోగా అందజేయాలని కోరారు. అభ్యర్థుల విద్యార్హతతో పాటు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు.

మంచినీరు, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలి

- సిపిఎం నాయకులు వెంకట్, శ్రీనివాస్

ప్రజాశక్తి- మోతుగూడెం

చింతూరు మండలం, గొందిగుడెం గ్రామంలో వీధిలైట్లు వేయాలని, మంచినీరు సరఫరా చేయాలని సీపీఎం నాయకులు పల్లపు వెంకట్, యర్రంశెట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గ్రామంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాలకులు, అధికారులు ప్రజాసమస్యలను మరిచారని, గెలిచిన తర్వాత ఈ గ్రామాల వైపు చూసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. నిధులు ఉండి లైట్లు వేయకుంటే సర్పంచుల తప్పని, నిధులు ఇవ్వకపోతే ప్రభుత్వం తప్పని, ప్రభుత్వం నుండి నిధులు రాబట్టేందుకు ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రజలకు గ్రామసభ పెట్టి వివరించాలని డిమాండ్ చేశారు. జమా లెక్కలు ప్రజలకు వివరించి పారదర్శకంగా ఉండాలన్నారు. సీపీఎం ప్రజాప్రతినిధులు ఉన్నచోట ప్రజలకు జవాబుదారీగా ఉన్నారని చెప్పారు. అన్నారు. ప్రస్తుతం వైసీపీ పాలనలో ఎక్కడ వేసినగొంగళి అక్కడే అన్న చందంగా ఏ సమస్య పరిష్కారం కాలేదన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ప్రజలే తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పోడియం లక్ష్మణ్, దూభి లక్ష్మణ్, లేలి పాపారావు, అరెల రమేష్, బంధం రమేష్, ఆరెల సారయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత శ్రీనివాస్

మాట్లాడుతున్న ఎస్ఐ సతీష్

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-హుకుంపేట:బాల్య వివాహాలు అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని స్థానిక ఎస్సై బి.సతీష్ కోరారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో బాల్య వివాహాలు నిర్మూలన కోసం మంగళవారం మహిళలు, పాఠశాల విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ, ఆడపిల్లలు స్మార్ట్ ఫోన్లు ఎక్కువగా వాడకూడదన్నారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండాలన్నారు. పౌష్టికాహారం ప్రాముఖ్యత, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కూలీలుగా వలసలు వెళ్లకుండా చదువుపై దృష్టి సాధించాలన్నారు. అనంతరం స్థానిక ఐసిడిఎస్ శాఖ సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి మాట్లాడుతూ, చిన్నప్పుడు పెళ్లిళ్లు చేసుకోవడంతో బరువు తక్కువ పిల్లలు పుట్టే అవకాశం ఉందని తెలిపారు. శిశు, మాతృ మరణాలు పెరుగుతుందన్నారు. ఈ మరణాలు తగ్గించాలంటే బాల్య వివాహాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రావు, వైద్యాధికారి గాయత్రి, సూపర్వైజర్లు, సర్పంచ్, అంగన్వాడీ సిబ్బంది, మహిళా పోలీసులు, పెద్దలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుబ్బారావు

వైసిపిని గద్దెదించాలి : టిడిపి

ప్రజాశక్తి -పాడేరు: వైసీపీ ప్రభుత్వాన్ని తక్షణమే గద్దె దించాలని డోకులూరు పంచాయతీలో తెలుగుదేశం పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావు శంఖారావాన్ని పూరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రి మణికుమారి మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దోచుకోవడం దాచుకోవడం, మడం తిప్పం అను సినీ డైలాగులు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి గాని ప్రజలకు గాని చేసింది ఏమీ లేదని తెలియజేశారు. నారా లోకేష్ తలపెట్టిన శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ని కొట్టగుళ్లి సుబ్బారావు తెలిపారు.అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీటీసీ చీముడు చిట్టిబాబుకి వైద్య ఖర్చుల నిమిత్తం ఐదు వేల రూపాయలను కొట్టగుళ్లి సుబ్బారావు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ వంజంగి కాంతమ్మ , పాడేరు మాజీ సర్పంచ్ వర్తన పిన్నియ్య దొర, డోకులూరు మాజీ సర్పంచ్ తమర్బా నాగం నాయుడు, మాజీ ఎంపీటీసీ కిముడు చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీ డూరి కృష్ణారావు, వంతాల కొండబాబు, వార్డు మెంబర్ తమర్భ కాంతమ్మ, వార్డ్ మెంబర్ గొల్లూరి చిన్నారావు, రత్నాలమ్మ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన

రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

ప్రజాశక్తి రంపచోడవరం

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూతులలో మౌలిక సదుపాయాలు పక్కాగా ఉండాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ సెక్టర్ అధికారులను, తహశీల్దార్లను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశపు హాల్లో సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై మంగళవారం రంపచోడవరం డివిజన్లోని ఏడు మండలాలతో అధికారులతో ప్రత్యేకంగా, చింతూరు డివిజన్లో నాలుగు మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం పనిచేయాలన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో 399 పోలింగ్ బూతులు ఏర్పాటు చేస్తున్నామని, అన్ని బూతుల్లో మౌలిక సదుపాయాలు పక్కాగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ బూత్లో మరమ్మతులు ఉంటే వెంటనే చేయించి ఆ ఫొటోలు సమర్పించాలని ఆదేశించారు. సెక్టార్ అధికారులు తమకు కేటాయించిన రూట్లలో ఏఏ వాహనాలు కావాలో ఎన్ని వాహనాలు కావాలో నివేదికల సమర్పించాలని, ఆయా రూట్లకు సంబంధించి రెండేసి రూట్ మ్యాప్‌లు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటర్లు తమకు నచ్చిన వారికి నిర్భయంగా ఓటు వేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వికలాంగులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు కొంతమేర వెసులుబాటు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు ఎ.కృష్ణకుమారి, చలపతిరావు, రమణారావు, సత్యనారాయణ, నాగమణి, డిప్యూటీ తహశీల్దార్లు యన్‌వివి సత్యనారాయణ, బి.రాజు, సుబ్బారావు, శ్రీధర్, శివ, సీనియర్ అసిస్టెంట్లు టి.లక్ష్మణ్, ఇందిరా బాయ్, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

అధిక లోడ్‌ను ఆపేదెవరు?

- ట్రాక్టర్లలో పరిమితికి మించి జామాయిల్ కర్రలు తరలింపు
- కాంట్రాక్టర్లకు సహకరిస్తున్న ఐటిసి యాజమాన్యం

ప్రజాశక్తి-చింతూరు

తెలంగాణ రాష్ట్రంలోని సారపాకలోని ఐటిసి పీఎస్పీడీ కర్మకారానికి ప్రధాన ముడిసరకు అయిన జామాయిల్ కర్ర చుట్టూ పక్కల విలీన మండల పరిసర ప్రాంతాల నుండి ఎగుమతి అవుతుంది. కర్రలను ప్రతి రోజూ వందల కొద్దీ ట్రాక్టర్లతో ఐటిసి పేపర్ మిల్లుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఒక లారీలో తరలించే కర్రలను ట్రాక్టర్‌పై సర్ది అధిక లోడ్‌తో తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అధికలోడ్ వలన గతంలో ఎన్నో మార్లు ట్రాక్టర్లు పల్టీకొట్టి డ్రైవర్లు, వాహనదారులు మరణించిన సంఘటనలు, తీవ్రంగా గాయపడిన సందర్భాలు ఉన్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో ఉన్న డ్రైవర్ల ప్రాణాలను లెక్కచేయకుండా ట్రాక్టర్ యజమానులు టన్నేజ్ ఎక్కువ రావడం కోసం ట్రాక్టర్లతో అధిక లోడ్ చేస్తున్నారు. దీంతో రోడ్డుపై చిన్న, చిన్న ఎత్తుపల్లాలు, గుంతల్లో సైతం ట్రాక్టర్లు పైకిలేచి బోల్తా కొడుతున్నాయి. ఈ క్రమంలో ట్రాక్టర్లకు పక్క నుండి ప్రయాణించే వాహనదారులు, ప్రజలు సైతం ప్రాణాలను కోల్పోవాల్సి వస్తోంది. అయినప్పటికీ ఐటిసి యాజమాన్యం, ట్రాక్టర్ల యాజమానులు, కాంట్రాక్టర్లు తమ వైఖరి మార్చుకోవడం లేదు.

చలానాలను విధిస్తున్నా మారని తీరు

కొద్ది కాలంగా భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అధికలోడుతో వస్తున్న ట్రాక్టర్లను ఆపి చలానాలు విధిస్తున్నప్పటికీ ట్రాక్టర్ల యాజమానుల తీరు మార్చుకోవడం లేదు. భద్రాచలం ఎంవిఐ తిరుపతి చలానాలు విధిస్తున్నారని ముందుగానే తెలుసుకుని బడా కాంట్రాక్టర్లు జాగ్రత్త పడి రాత్రి సమయంలో తోలకాలు సాగిస్తున్నట్లు సమాచారం.

కర్ర కాంట్రాక్టర్లకు సహకరిస్తున్న ఐటిసి యాజమాన్యం?

ఇష్టారాజ్యంగా అధిక లోడ్లతో రవాణా చేస్తున్న బడా కాంట్రాక్టర్లకు ఐటిసి యాజమాన్యం పూర్తిగా సహకరిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కర్రను అధికంగా రవాణా చేయడం కోసం, ఎక్కువ మోతాదులో లోడ్ చేయడానికి వీలుగా ట్రాక్టర్ల ట్రక్కులను తయారు చేస్తున్నారు. ట్రాక్టర్ల యజమానులు వ్యాపారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకొని డ్రైవర్లు, వాహనదారుల ప్రాణాలను గాలికొదిలేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అధిక లోడ్‌తో ప్రయాణించే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని అరికట్టాలని పలువురు వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

అధిక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్

కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించడమే లక్ష్యం

ప్రజాశక్తి-పాడేరు: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆదివాసులకు, రాష్ట్ర ప్రజలకు మాయ మాటలు చెప్పి కొత్త ఎత్తుగడలతో వస్తున్న బిజెపి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలను ఓడించడమే ప్రధాన లక్ష్యని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గతంలో అరకు పార్లమెంటులో ఎంపీగా గెలుపొందిన కొత్తపల్లి గీత ఇప్పుడు బిజెపితో జతకట్టి మళ్లీ ఎంపీ లేదా ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి సిద్ధపడుతూ ఆదివాసులను మోసం చేసేందుకు మళ్లీ ఎన్నికల బరిలో వస్తున్నారన్నారు.

కొంతమంది బిజెపి నాయకులు కూడా వ్యతిరేకించిన పరిస్థితి ఉందని, అలాంటప్పుడు గీతకు ఎమ్మెల్యే టికెట్ లేదా ఎంపీ టికెట్ ఇవ్వడంపై బిజెపి వైఖరి ఆదివాసులకు స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఎంపీగా గెలుపొంది ఢిల్లీకే పరిమితమై ఆర్థిక లావాదేవీలు వ్యాపారానికి అంకితమైన వారు ఆదివాసులకు ఏమి ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కూడ రాధాకృష్ణ, జల్లి రాజబాబు, చంటిబాబు పాల్గొన్నారు.

పేదలకు అండగా సిపిఎం

తవిటినాయుడు సంస్మరణ సభలో ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి - ఆరిలోవ : పేద ప్రజలకు అండగా సిపిఎం ఎర్రజెండా నిరంతరం పనిచేస్తుందని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి. కుమార్ అన్నారు. పదోవార్డు ఆరిలోవ బిఎన్ఆర్ నగర్ కాలనీలో సిపిఎం సభ్యులు, ఆరిలోవ జోన్ ఐద్వా కార్యదర్శి గౌరీ భర్త సంగరెడ్డి తవిటినాయుడు సంస్మరణ సభ జరిగింది. ముందుగా తవిటినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాపీమేస్త్రీగా పనిచేస్తూ, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి కృషిచేసిన తవిటినాయుడు చిన్న వయస్సులోనే తనువు చాలించడం బాధాకరమన్నారు. తన భార్య గౌరిని ఐద్వాలోనూ, పిల్లలను బాలల సంఘంలోనూ ఎస్ఎఫ్ఐలోనూ పాల్గొనే విధంగా ప్రోత్సహించారన్నారు. సిపిఎం ఎర్ర జెండా వారి కుటుంబానికి అన్నివేళలా అండగా వుంటుందన్నారు.

ఆరిలోవ ప్రాంతంలో పేదలకు ఇళ్లు, ఇతర సమస్యల పరిష్కారానికి సిపిఎం విశేషంగా పోరాడిందని,నీ ఉద్యమంతో తన కుటుంబంతో సహా తవిటినాయుడు పాల్గొన్నారని కొనియాడారు.కాలనీ అధ్యక్షులు డి.నాగరాజు అధ్యక్షత వహించిన సంస్మరణసభలో సిపిఎం ఆరిలోవ జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్, సిఐటియు జోన్ అధ్యక్షులు పి. శంకరరావు, ఐద్వా జోన్ అధ్యక్షులు ఎస్.రంగమ్మ, కాలనీ నాయకులు లక్ష్మినారాయణ ,రమణ, సూర్యనారాయణ, సూరిబాబు,శాంతి, లక్ష్మి, ముత్యాలమ్మ, కుటుంబ సభ్యులు నాయుడు, రాము, పూజిత, లోకేష్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు. అంతకు ముందు ప్రజానాట్యమండలి కళాకారులు చంటి, భారతి, సత్య, సూర్యనారాయణలు విప్లవ గీతాలు ఆలపించారు.

పంటల సాగు నమోదుపై పరిశీలన

ప్రజాశక్తి-ఆనందపురం: ప్రస్తుత రబీ సీజన్‌లో పంటల సాగు నమోదుపై వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయంలోని ప్రణాళిక విభాగం ఉపసంచాలకులు ఎం.జగ్గారావు పరిశీలించారు.మంగళవారం వేములవలస రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు అనంతరం గొట్టిపల్లి గ్రామంలో ఇ-పంటల నమోదుపై ఆరా తీశారు. రికార్డుల్లో నమోదు వివరాలకు, క్షేత్రస్థాయిలో రైతు వేసిన పంట రకాలు, విస్తీర్ణం తదితర వివరాలు సరిపోయాయో లేదో సరిపోల్చి పరిశీలన జరిపారు. రబీ సీజన్‌లో రైతులంతా పంటల నమోదు చేపట్టాలని, తర్వాత ఇకెవైసి చేయించాలని రైతు భరోసా సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ బొడ్డేపల్లి విజయ్‌ప్రసాద్, స్థానిక ఎఒ సిహెచ్ సంధ్యారత్నప్రభ పాల్గొన్నారు.

రక్త హీనతపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : ప్రపంచ రక్తహీనత నివారణ దినోత్సవం సందర్భంగా భీమిలి మండలం, తాళ్ళవలస బాలల సంరక్షణ కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక సంగివలస , ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఆధ్వర్యాన జరిగిన ఈ సదస్సులో వైద్యులు ప్రతిమాదేవి, రామ భద్రరాజు, జగన్నాథ కార్తీక్, బాలలకు ఆరోగ్య పరమైన అంశాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు

సమస్యలపై మిడ్డే మీల్స్ కార్మికుల వినతి

మాజీ ఎమ్మెల్యే ఈశ్వరికి వినతిపత్రం ఇస్తున్న భోజన కార్మికులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండల పరిధిలోని ఎంపీపీ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం ప్రభుత్వం చెల్లించే విధంగా కృషి చేయాలని పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డ ఈశ్వరికి మిడ్డేమీల్స్ కార్మికులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు కె..కుమారి, చిన్నతల్లి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు శ్రమకు తగ్గ జీతాలు ఇవ్వకపోగా ప్రతినెల సక్రమంగా వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంట కుక్కలకు నెలకు 1000 నుంచి 2000 రూపాయలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుందని, అవి కూడా సక్రమంగా మంజూరు చేయకపోవడంతో తమ కుటుంబ పోషణ కష్టమవుతుందని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ శ్రమను గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కె.లక్ష్మమ్మ, వి.కమల, ఎం.రంభ పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయవార్షికోత్సవం

ప్రజాశక్తి-చింతూరు : చింతూరులో శ్రీషిరిడి సాయిబాబా ఆలయ 11వ వార్షికోత్సవం సినిమా హాల్ సెంటర్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు కాకడ హారతి, 6 గంటలకు సామూహిక అష్టోత్తర జలాభిషేకం, 12 గంటలకు మధ్యాహ్నం మహా అన్నదాన సమారాధన, సాయంత్రం నాలుగు గంటలకు పల్లకి ఉత్సవం ఊరేగింపు, 6 గంటలకు సాయం సంధ్య హారతి, రాత్రి 9 గంటలకు స్టేజ్ హారతి తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జైళ్లశాఖ అధికారులకు పునశ్చరణ తరగతులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జైళ్ళశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పునశ్చరణ తరగతులను ప్రారంభించారు. రాష్ట్రంలోని జైళ్ళశాఖ డిఐజిలు, పర్యవేక్షణాధికారులు, జైలర్లు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఒరియంటేషన్ తరగతులను జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా, రాష్ట్ర జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావుతో కలిసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఎయు సోషియాలజీ ప్రొఫెసర్ శ్రీమన్నారాయణ ఆస్పెక్ట్స్ ఆఫ్ సోషల్ ఇంక్యుబెషన్ కేంద్రం గురించి, వాటి ద్వారా ఖైదీలకు చేపట్టే సంస్కరణల గురించి వివరించారు. జైళ్ళ ఉప శాఖాధికారులు ఎంఆర్ రవికిరణ్, ఎం.వరప్రసాద్‌లు జైళ్లను ఎలా అభివృద్ధి చేయాలి, ఫైనాన్షియల్ ప్లానింగ్, జైళ్ళ భవిష్యత్ ప్రణాళిక మున్నగు విషయాలను మానిటర్ ద్వారా ప్రెజెంటేషన్ చేసి, తెలియజేసారు. అంతక ముందు జైళ్ళ శాఖకు సంబంధించిన యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లను డిఐజి హరీష్ కుమార్ గుప్తా లాంఛనంగా విడుదల చేసారు.కార్యక్రమంలో విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్ కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, జైలు అధికారులు, సిబ్బంధి పాల్గొన్నారు

నాసా పోటీల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -మధురవాడ : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'నాసా' అంతరిక్ష పరిశోధనా సంస్థ నిర్వహించిన నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో పిఎం పాలెంలోని నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, మధురవాడ బ్రాంచ్ విద్యార్థులు మంచి ప్రతిభను కనపరచారు. విద్యలోనూ, వైజ్ఞానిక విషయాల్లోనూ సత్తా చాటి, అంతర్జాతీయ స్థాయిలో నారాయణ విద్యాసంస్థ ఖ్యాతిని ఇనుమడింపజేసిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎజిఎం రాజ్‌కుమార్, ఆర్ఐ రఘు,అకడమిక్ కోఆర్డినేటర్ సూర్య ప్రతాప్, ప్రిన్సిపల్ లలిత, కుమారి అభినందించారు.

కెకెలైన్‌లో విరిగిపడ్డ బండరాళ్లు

నిలిచిన విశాఖ ప్యాసింజర్.. పలు రైళ్ల దారి మళ్లింపు... ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి- అనంతగిరి:కొత్తవలస కిరోండల్ కేకే లైన్‌లో రైలు పట్టాలపై బండరాళ్లు విరిగిపడ్డాయి. సోమవారం రాత్రి బొడ్డవర, శివలింగపురం మార్గమధ్య 38 కిలోమీటర్ల సమీపంలో పట్టాలపై బండరాలు విరిగిపడ్డాయి. గమనించిన రైల్వే సిబ్బంది శివలింగపురం, బొడ్డవర రైల్వే స్టేషన్లకు సమాచారం అందించారు. కిరోండల్ నుండి విశాఖపట్నం వెళు తున్న పాసింజర్ రైలును బొర్రా రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. విశాఖ, కొత్తవలస, మీదుగా కిరోండల్ వెళ్ళు గూడ్స్ రైలును బొడ్డవర రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు.రైళ్ల రాకపోకలను దారి మళ్లించారు. కిరోండల్, గోరాపూర్, తదితర ప్రాంతాల నుండి పాసింజర్‌లో విశాఖకు ప్రయాణించే పలువురు ప్రయాణికులు అర్ధరాత్రి సుమారు పది గంటల పైనే పాసింజర్ రైలు లోపలే ఉండిపోయారు. దీంతో ప్రయాణకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

కేక లైన్ పట్టాలపై విరిగిపడ్డ బండ రాళ్లు

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణపై దాడి అమానుషం

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వుడా త్రినాధరావు

ప్రజాశక్తి- పాడేరు: అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వుడా త్రినాధరావు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉండటం కొందరు జీర్ణించుకోలేక అక్కసుతో దురుద్దేశ పూర్వకంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. సమాజంలో అన్ని కులాలతో పాటు ఆర్య వైశ్యులు కూడా రాజకీయాల్లో ఉండే హక్కు ఉందని, తూకాలతో మోసాలు జరిగితే గిట్టుబాటు ధర లభించక పోతే చైర్మన్‌కు, సెక్రెటరీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి తప్పా దాడు లకు పాల్పడడం అమానవీయమని ఖండించారు. మహిళల పట్ల ఇలాంటి చర్యలకు పూనుకోవడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు.మళ్ళీ ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వమే తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టేందుకు ఆర్యవైశ్యు లంతా ఐక్యంగా సన్నద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. దీన్ని ఖండిస్తూ నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

కొర్రాలో వైద్య శిబిరం

పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కొర్రా పంచాయతీ కేంద్రంలో మంగళవారం ఫ్యామిలి పిజీషియన్ కార్యక్రమంతో ఇంటింటికి వైద్య సేవలను సిబ్బంది అందించారు. సాధారణ వ్యాధులు, జ్వరాలతో ఉన్న బాధితులకు రక్తపరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి రాంబాబు గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్య సేవలను అందించారు. రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకర పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని సూచించారు. జలుబు, దగ్గు, జ్వరం ఉంటే ఆశా కార్యకర్తను సంప్రదించి వైద్యం పొందాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకుంటే వ్యాధులు దరిచేరవని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ రత్నమ్మ, హెచ్వి పద్మ, హెల్త్ అసిస్టెంట్ లోవరాజు, ఏఎన్ఎం సుశీల తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటివేత

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: -ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని పరిరక్షించుకోవాలని అరకు పంచాయతీ సర్పంచ్ జీ.శారద చెప్పారు. మండలంలోని అరకు పంచాయతీ బందగట్టు రోడ్డు కిరువైపులా సుమారు 40 మొక్కలను మంగళవారం నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మొక్కలు మానవులకు ఆక్సిజన్ అందిస్తుందన్నారు ఇటువంటి మొక్కలను ప్రతి ఒక్కరు నాటి వాటిని పరిరక్షించుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ మొక్కలను స్పాన్సర్ చేసిన బిబి రాఘవేంద్రను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ వార్డు సభ్యుడు గంగాధర్, గ్రామస్తులు చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న సర్పంచ్

హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్య

మృతి చెందిన విద్యార్థిని వసంత

ప్రజాశక్తి -అరకులోయ :అరకులోయ లోని కంట బౌన్స్ గూడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఓ గిరిజన విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంచలనమైంది. డుంబ్రిగూడ మండలం ఒంబి గ్రామానికి చెందిన కిలో వసంత (9వ తరగతి) అనే గిరిజన బాలిక మూడు రోజుల క్రితం హాస్టల్ నుంచి సెలవు తీసుకుని ఇంటికెళ్ళింది. మంగళవారం మధ్యాహ్నం హాస్టల్‌కు తిరిగి వచ్చిన వసంత బట్టలు మార్చుకొని క్లాస్ కి వెళ్తానని తోటి వారికి చెప్పి గదిలో ఉండిపోయింది. ఇంతలోనే తాను ఉంటున్న గదిలో చున్నీతో ఉరి వేసుకొని చనిపోయి వేలాడుతూ ఉండడం గమనించిన కొంతమంది తోటి విద్యార్థినులు పాఠశాల హెచ్ఎం, హెచ్‌డబ్ల్యుఓకు సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నట్లు హాస్టల్, స్కూల్ నిర్వాహకులు తెలిపారు.ఈ విషయంపై అరకులోయ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయడంతో స్పందించిన సీఐ రుద్రరాజు తమ సిబ్బందితో హాస్టల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అరకులోయ మార్చురీకి తరలించారు. మృతికి గల కారణం మాత్రం తెలియాల్సి ఉందని సీఐ రుద్రరాజు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాడేరు డిడి కొండలరావు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. పేద గిరిజన కుటుంబానికి చెందిన మృతురాలు కిల్లో వసంత కుటుంబ సభ్యులు, బంధువులు మాత్రం ఈ సంఘటన పై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి -పాడేరు:పాడేరు గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతూ, అనారోగ్యానికి గురై మృతి చెందిన కుంచ పూర్ణ భార్గవి కుటుంబాన్ని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పాడేరు గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న కుంచ పూర్ణ భార్గవి తన స్వగ్రామైన పెదబయలు మండలం గంపరాయి గ్రామం నుండి ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో పాడేరు జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవల నిమిత్తం అడ్మిట్ చేశారని, వైద్యం పొందుతూ మంగళవారం మృతి చెందిందన్నారు. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అనారోగ్య కారణాలతో మృత్యువాత పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు మౌనం వహించడం దుర్మార్గమన్నారు.ఆశ్రమాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఇంకా సమాఖ్య నాయకులు లక్ష్మణరావు ఆమోస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా జాతీయ మహాసభలను

జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పెందుర్తి : ఈనెల 22, 23, 24 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న ఐద్వా అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలని ఐద్వా జోన్ కార్యదర్శి లక్ష్మి పిలుపునిచ్చారు .మంగళవారం విరాట్‌నగర్‌లో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాల పాలనలో మహిళలపై దాడులు పెరిగాయని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. చట్టాలు చేస్తున్నా వాటిని పటిష్టంగా అమలు చేయకపోవడంతో తీవ్ర నేరాలకు సైతం కఠినశిక్షలు పడకపోవడంతో నేరాల రేటు తగ్గుముఖం పట్టడం లేదన్నారు. మహిళల సంక్షేమం, స్వావలంభన అంటూ ప్రభుత్వ పెద్దలు, నేతల ఊకదంపుడు ఉపన్యాసాలే తప్ప, అమలులో కనీస చిత్తశుద్ధి లేకపోవడం వల్ల మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఐద్వా మహాసభల్లో మహిళల సమస్యలపై విస్తృతంగా చర్చించి, వాటి పరిరక్షణకు చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై తీర్మానాలుంటాయన్నారు. పెందుర్తి ప్రాంతాలో ఐద్వా సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వస్తోందన్నారు.

హాస్టల్ ఆవరణలో కూరగాయల సాగు

హాస్టల్ ఆవరణలో పండిస్తున్న బీర పాదులు

- సేంద్రీయ పద్ధతిలో పంటపై ప్రత్యేక శ్రద్ధ
- పండించి, విద్యార్థులకు వండి పెడుతున్న వైనం
- వార్డెన్ తాతాజీ కృషి, చొరవ ఆదర్శనీయం

వంగతోట

ప్రజాశక్తి-చింతూరు: ఒక వ్యవస్థను నడిపేవారికి దానిని మెరుగ్గా నిర్వహించాలన్న తపన, పట్టుదల ఉంటే ఫలితాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. చింతూరు మండల కేంద్రంలోని బీసీ వసతి గృహం సంక్షేమ అధికారి తాతాజీ ఈ విధంగా హాస్టల్ నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. హాస్టల్ ఆవరణలో తాతాజీ పలు రకాల కూరగాయలు పండిస్తున్నారు. అది కూడా సేంద్రీయ పద్ధతిలో ఈ కూరగాయలను పండించి వాటిని విద్యార్థులకు వండి పెడుతున్నారు. విద్యతోపాటు కూరగాయల పంటలు ఎలా పండించాలో విద్యార్థులకు తెలియజేస్తూ సాగు పద్ధతులను వారికి నేర్పుతున్నారు. బయట మార్కెట్లో కూరగాయల ధరలు ఆకాశానంటుతున్నాయి. నేడు మార్కెట్లో లభించే రసాయన ఎరువులతో పండించే కూరగాయలు వలన పలు అనారోగ్య సమస్యలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన పెరట్లోనే ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు పండించే విధానాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.



వార్డెన్ తాతారావు

హాస్టల్ ఆవరణలో ఒకవైపు మిర్చి, బీర, అనపపాదులు, చిక్కుడు, వంగ, అలసందలు, టమాటా మొక్కలు, మరోవైపు కూర అరటితో పాటు తీయటి అరటి పండ్ల తోటను సాగు చేస్తున్నారు. దీంతో హాస్టల్ ఆవరణ ఆహ్లాదకరంగా మారింది. హాస్టల్లో వినియోగించిన వృధా నీరు ఈ మొక్కలకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. అయితే ప్రస్తుతం హాస్టల్లో కేవలం ఒక్క బోరు మాత్రమే ఉండటంతో 110 మంది విద్యార్థులకు స్నానానికి, మరుగుదొడ్లకు నీరు సరిపోని పరిస్థితి ఉంది. హాస్టల్‌కు కనీసం సున్నం వేయటానికి కూడా నిధులు రావడం లేదని, ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి సహకరిస్తే హాస్టల్‌ను మరింత అభివృద్ధి చేస్తానని వార్డెన్ తాతాజీ ఈ సందర్భంగా ప్రజాశక్తికి తెలియజేశారు. ప్రభుత్వ అధికారులు ఈ హాస్టల్‌ను సందర్శించి సమస్యలను తెలుసుకొని తగిన నిధులు కేటాయించి ప్రోత్సహించాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఆకుకూరలు

మిరపపంట



చిక్కుడు పాదులు

గెలతో ఉన్న అరటిమొక్కలు

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రావాలి

- ఎపి కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్

ప్రజాశక్తి - పెందుర్తి : ఎపిలో కాంగ్రెస్ పూర్వవైభవానిక బూత్ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి వరకు పార్టీ కేడరంతా సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందనిఎపి కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్ పిలుపునిచ్చారు. మంగళవారం 97వ వార్డు సుజాతనగర్ ఇంద్రాణి ఫంక్షన్ హాల్‌లో ఆరు జిల్లాల పార్టీ ముఖ్య నాయకులతో ఆర్గనైజింగ్ సెక్రటరీ వేగి దివాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం ఠాగూర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు రాష్ట్రంలో అభిమానులు, కార్యకర్తలు ఉన్నారని, వారందరినీ మళ్లీ ఏకతాటిపైకి తేవడం ద్వారా క్షేత్రస్థాయిలో ఉత్సాహంగా పనిచేయాలని, తద్వారా వచ్చే ఎన్నికల్లో సత్తా చాటే స్థాయికి చేరుకునేలా ప్రతిఒక్కరూ ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.. పార్టీ అధిష్టానం ఎవరికి టిక్కెట్ ఇచ్చినా అందరం కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో ఎపి యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ షఫీఉల్లా, ఎఐసిసి జనరల్ సెక్రటరీ గిడుగు రుద్రరాజు, విశాఖ జిల్లా అధ్యక్షులు గొంప గోవింద్ర, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్, విజయనగరం జిల్లా అధ్యక్షులు శరగడం రమేష్ కుమార్, అల్లూరు జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడారి రమేష్ నాయుడు, నాయకులు కొయ్య ప్రసాద్‌రెడ్డి, రాము, దారప్ప పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో మంగళవారం వేర్వేరు ప్రాంతాల్లో వీధి కుక్కలు దాడి చేసిన ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సీలేరు గ్రామపంచాయతీ పరిధి దుర్గా వీధికి చెందిన కొర్ర శివ ప్రతిరోజు లాగే ఏపీ జెన్కో ఎస్సీ సివిల్ కార్యాలయం వెనుక అటవీ ప్రాంతానికి జీలుగ కళ్ళు సేకరణకు మంగళవారం కూడా వెళుతుండగా, ఆయనపై మూడు కుక్కలు ఒకేసారి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల దాడికి శివ శంకభాగంలో పెద్దపెద్ద గాట్లు కావడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. దీంతో శివని వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి గాయాలకు కుట్లు వేసి ప్రథమ చికిత్స చేశారు. దుర్గా వీధికి చెందిన కొర్ర చైతాన్‌పై కుక్కలు దాడి చేసి గాయపరచడంతో ఆయన కూడా ఆస్పత్రిలో వైద్య సేవలు అందించారు. కుక్కల దాడి సంఘటన తెలిసిన సీలేరు ప్రజలు తీవ్రభయాందోళన చెందుతున్నారు.

కొడుకు కొట్టాడని తల్లి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -సీలేరు :అన్నం వండలేదని కొడుకు కొట్టడంతో మనస్థాపానికి గురైన తల్లి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికుల తెలిపిన వివరాలు ప్రకారం... జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి పిల్లిగెడ్డ గ్రామానికి చెందిన కొర్ర పొట్టి సతీమణి కొర్ర ఫాతిమా (58) అన్నం వండలేదని ఆమె కుమారుడు కోపంతో కొట్టాడు. దీంతో మనస్థాపానికి గురైన ఫాతిమా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఇది గమనించి ఆమెను వెంటనే సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్య సేవలు అందించి, అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఏపీ జెన్కో సిఎస్ఆర్ అంబులెన్స్‌లో చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.